క్లుప్తంగా

సంతకాల సేకరణ



లొకొండలో సంతకాలు సేకరిస్తున్న గిరిజనులు

హిరమండలం: ఉద్దానం ఫేజ్–2లో భాగంగా తమ గ్రామాలకు తాగునీరు అందించాలని గిరిజనులు కోరుతున్నారు. లోకొండ పంచాయతీ పరిధిలోని లోకొండ, మామిడిజోల, గొడియాపాడు, తాళ్లపాడు, పూలకొండ, లింగిపురం, ముగడపేట గ్రామాల్లో తాగునీటి సదుపాయం కల్పించాలంటూ శుక్రవారం అభిప్రాయసేకరణతోపాటు సంతకాల సేకరణ చేశారు. వీటిని అధికారులు, ప్రజాప్రతినిధులకు అందజేస్తామని గిరిజనులు తెలిపారు.

94 మందికి వైద్య పరీక్షలు



వైద్య సేవలు అందజేస్తున్న వైద్య సిబ్బంది

హిరమండలం: మండలంలోని చవితిసీది గ్రామంలో అమ్మన్న చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు తంగి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి వైద్యులు, హిరమండలం పీహెచ్‌సీ వైద్యులు గౌతమి, కోటీశ్వరరావు 94 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్ పి.వినిత, రాజు, శివ, తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకి మించి ఎరువులు వాడొద్దు



నానో ఎరువులు పంపిణీ చేస్తున్న ఏడీ రాజగోపాలరావు

సరుబుజ్జిలి: ఎరువులు మోతాదుకు మించి వినియోగించడం వల్ల భూమి నిస్సారమవుతుందని వ్యవసాయశాఖ ఏడీ బి.రాజగోపాలరావు తెలిపారు. ఎరువుల వినియోగంపై రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులుకు నానో యూరియాను ఉచితంగా అందించారు. రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త అత్తులూరి లావణ్య, అత్తులూరి హరిప్రసాద్, సవర ధర్మారావు, సవర ఎల్లయ్య, సవర బుడ్డు తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలకు 90 మంది ఎంపిక



మాట్లాడుతున్న శశిభూషణ్

నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా విభిన్న ప్రతిభావంతులకు వారి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఉపకరణాలు పంపిణీ చేయనున్నామని సర్వశిక్ష అదనపు పథక సంచాలకులు ఎస్.శశిభూషణ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని ప్రత్యేకావసరాల గల వారికి ఉపకరణాలు ఇచ్చేందుకు ప్రత్యేక శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. అవసరమైన వారందరికీ ఉపకరణాలు అందజేస్తామన్నారు. సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ గోవిందరావు మాట్లాడుతూ.. 90 మందికి ఉపకరణాలు ఇచ్చేందుకు ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు, జలుమూరు ఎంఈఓ బమ్మిడి మాధవరావు, భవిత కేంద్రాల సహిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శ..



హిరమండలం: గోవిందరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రెడ్డి శాంతి

హిరమండలం: మండలంలోని చవితిసీది గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బూర్లె ప్రకాశరావు గత కొన్నిరోజులుగా కనిపించడం లేదు. మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బూర్లె గోవిందరావును పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ, నాయకులు వంజరావు చిరంజీవి, ఎం.రామారావు, నక్క ఆనందరావు, గొర్లె తిరుపతిరావు, లుకలాపు ప్రసాద్, తదితరులు ఉన్నారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎద్దు హరిదాసు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనను రెడ్డి శాంతి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించి వారిలో పార్టీ నాయకులు ఉన్నారు.

అగ్నిప్రమాదం జరిగితే అంతే..!

- కొత్తూరు నుంచి వాహనం వచ్చేసరికి బుగ్గి
- పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు శాపం
- కొత్త అగ్నిమాపక కార్యాలయం ఏర్పాటుపై ఆశలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఈ ఏడాది జూన్ 10న హిరమండలం మండలం కూర్మ (ఆధ్యాత్మిక వైదిక) గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగింది. రాధాకృష్ణ మందిరంలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. అక్కడ నివాసితులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. విద్రోహచర్యగా అభిప్రాయపడినా.. చివరకు ప్రమాదమని అధికారులు తేల్చారు. హిరమండలంలో కానీ, పాతపట్నంలో కానీ అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంటే భారీ నష్టం జరిగి ఉండేది కాదు.



మెళియాపుట్టి మండలంలోని కొండ ప్రాంతాల్లో ఏటా ప్రమాదాలు జరుగుతున్నాయి. కొండపోడు వ్యవసాయంలో భాగంగా జీడి, మామిడి సాగు చేస్తుంటారు. ఏటా వేసవిలో తోటలకు నిప్పంటుకొని గిరిజన రైతులకు నష్టం పరిపాటిగా మారింది. ఆ సమయంలో కొత్తూరు నుంచి.. అటు పలాస, టెక్కలి నుంచి అగ్నిమాపక వాహనం వచ్చేసరికి అపార నష్టం జరిగిపోతోంది.



కొత్తూరు అగ్నిమాపక శాఖ కార్యాలయం

హిరమండలం: ప్రతి మండలంలోనూ ప్రజల అవసరాల దృష్ట్యా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండాలి. అందులో అగ్నికమాపక కేంద్రం ఒకటి. ఇది ప్రతి మండలానికి అత్యవసరం. అటువంటిది పాతపట్నం నియోజకవర్గంలో మాత్రం ఒకే ఒక అగ్నిమాపకశాఖ వాహనం ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో నైసర్గిక స్వరూపంలో అతిపెద్ద నియోజకవర్గం పాతపట్నం. ఈ నియోజకవర్గంలో పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాలున్నాయి. కొత్తూరులో మాత్రమే అగ్నిమాపకశాఖ కార్యాలయం ఉంది. కొత్తూరు నుంచి పాతపట్నం, మెళియాపుట్టి వాహనం రావాలంటే దాదాపు 30 కిలో మీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. అటు ఎల్.ఎన్.పేట మండలానికి వెళ్లాలంటే అంతే దూరం పడుతోంది. అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా మెళియాపుట్టి, పాతపట్నం మండలాల్లో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు పక్కనే ఉన్న ఒడిశాలోని గజపతి జిల్లాపై ఆధారపడాల్సిన దౌర్భాగ్య పరిస్థితి గతంలో ఉండేది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఒడిశా నుంచి అగ్నిమాపక యంత్రం రావడంలేదు. ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య ఏం జరిగిందో తెలియని పరిస్థితి నెలకొంది. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ పాతపట్నం నియోజకవర్గంలో అగ్నిమాపక శాఖ కార్యాలయం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం.. తరువాత బుట్టదాఖలు చేయడం పరిపాటిగా మారింది. కూటమి ప్రభుత్వం సైతం ఇదే మాదిరిగా హామీ ఇచ్చింది. ఇచ్చినమాట నిలబెట్టుకోవడంలో మాత్రం విఫలమైంది.

పేరుకే పెద్ద నియోజకవర్గం..

జిల్లాలో అతిపెద్ద నియోజకవర్గం పాతపట్నం. ఎల్.ఎన్.పేట మండలం బొర్రంపేట నుంచి మెళియాపుట్టి మండలం గొప్పిలి వరకు దాదాపు 50 కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. కొత్తూరు మండలం నుంచి మెళియాపుట్టి, పాతపట్నం మండలంలోని సరిహద్దు గ్రామాలు అంతే దూరంలో ఉంటాయి. అగ్నిప్రమాదాలు, అత్యవసర సమయాల్లో కొత్తూరు నుంచి అగ్నిమాపక వాహనాలు ఒడిశాలోని పర్లాకిమిడి దాటుకొని రావాల్సి ఉంటుంది. వాహనంలో నీటిని లోడ్ చేసుకొని రావాలంటే గంటల సమయం పడుతోంది. వాహనం రావడం ఆలస్యం కావడంతో అప్పటికే నష్టం జరిగిపోతోంది. అందుకే నియోజకవర్గంలో అదనపు అగ్నిమాపకశాఖ కార్యాలయంతోపాటు వాహనాన్ని అందుబాటులోకి తేవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

హామీ బుట్టదాఖలు



ఏటా అగ్నిప్రమాదాల సమయంలో మూల్యం చెల్లించుకుంటున్నాం. అగ్నిప్రమాదాల సమయంలో పక్కనే ఉన్న ఒడిశాపై ఆధారపడుతున్నాం. పాతపట్నంలో అగ్నిమాపకశాఖ కార్యాలయం ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ హామీని బుట్టదాఖలు చేసింది.

– సవిరిగాన ప్రదీప్, వైస్ ఎంపీపీ, పాతపట్నం

ప్రజలకు తీరని నష్టం..



ఏటా ఏదో ఒకచోట జరుగుతున్న అగ్నిప్రమాదాలతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. సకాలంలో అగ్నిమాపక వాహనాలు రాక అంతులేని నష్టం జరుగుతోంది. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం దృష్టి పెట్టాలి. అగ్నిప్రమాదాలు జరుగుతున్న ప్రతిసారి ఒడిశాపై ఆధారపడడం సిగ్గుచేటు. కనీసం పాతపట్నంలో కానీ, హిరమండలంలో కానీ అగ్నిమాపక వాహనం అందుబాటులోకి తేవాలి.

– డి.సుందరమ్మ, సర్పంచ్, మేజర్ పంచాయతీ, హిరమండలం

న్యాయవాదుల నిరసన



నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

ఆమదాలవలస: ఏపీ హైకోర్టు జారీ చేసిన సర్క్యులర్‌కు వ్యతిరేకంగా ఆమదాలవలస బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులు మాట్లాడారు. కోర్టు ప్రారంభ సమయంలో సంతాపం పాటించకుండా సాయంత్రం 4.30 గంటలకు పాటించాలని హైకోర్టు తీసుకున్న నిర్ణయం సరైంది కాదన్నారు. సంతాపం అనేది న్యాయవాదుల భావోద్వేగాలకు సంబంధించిన అంశమని, దీనిని సాయంత్రం వరకు వాయిదా వేయడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. తక్షణమే సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపు సత్యనారాయణ, సెక్రటరీ బగాది గోవిందరాజు మాజీ సెక్రటరీ అల్లాడ విజయకుమార్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మెరిసిన సిక్కోలు కళాకారులు



నాట్య కళాకారిణి కూన శ్రీలత, బృందం

ఆమదాలవలస: కేరళలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా సిక్కోలు నాట్య కళాకారిణి కూన శ్రీలత, ఆమె బృందం నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. పట్టణానికి చెందిన సీనియర్ నాట్య కళాకారులు డాక్టర్ చింతాడ రవిబాలకృష్ణ ఆధ్వర్యంలో కేరళలోని రెండు పట్టణాల్లో బుధ, గురువారాల్లో నృత్య ప్రదర్శనలు ఇచ్చినట్లు శ్రీలత శుక్రవారం తెలిపారు. అన్నామలై పట్టణ త్రిబంగి ఉత్సవ నిర్వహణలో సంగీత్ నాటక అకాడమీ సీఎస్‌ఏ మండపంలో మోహిని భస్మాసుర నృత్యాన్ని ప్రదర్శించామన్నారు. టీడీఎం వంద సంవత్సరాల ఉత్సవాల్లో భాగంగా ఎర్నాకులంలో మహిషాసుర మర్దిని అనే కళారూపాన్ని నృత్య ప్రదర్శన ఇచ్చినట్లు తెలిపారు. తమ బృందాన్ని కేరళ ప్రతినిధులు సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



జిల్లేడు ద్రావణం తయారీని వివరిస్తున్న ఐసీఆర్పీ ఫల్గుణరావు

పాతపట్నం:

ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి ఐసీఆర్పీ దువ్వారి ఫల్గుణరావు అన్నారు. మండలంలోని సరాలి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులుకు శుక్రవారం అవగాహన కల్పించారు. తెగుళ్లు ఆశించే పురుగులు, వరిలో పోటాస్ లోపం నివారణకు జిల్లేడు ద్రావణం ఉపయోగపడుతుందన్నారు. జిల్లేడు ద్రావణం తయారు చేసే విధానాన్ని రైతులుకు వివరించారు. ఐసీఆర్పీలు నీరంజన్, సోయి పాల్గొన్నారు.

కుంకుమార్చనలు



నరసన్నపేట: మాకివలసలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

సారవకోట: మండలంలోని అవలింగి నీలమణి అమ్మవారిని శుక్రవారం శాకంబరీ దేవిగా అలంకరించారు. అమ్మవారి మూలవిరాట్‌ను వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో అలంకరించి ప్రత్యేక, విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. సారవకోట ఉజ్జయిని మహాకాళీ ఆలయంలో అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేపట్టారు. స్వర్ణమణి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రుత్వికులు సంతోష్ శర్మ మహిళలతో కుంకుమార్చనలు చేయించారు.

పొందూరులో..

పొందూరు: స్థానిక కంచి కామాక్షి ఆలయంలో దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం మహిళలు కుంకుమపూజలు చేశారు.

పురుషోత్తపురంలో..

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయభవాని కమిటీ ఆధ్వర్యంలో కుంకుమార్చనలు నిర్వహించారు. భవానీ భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: మండలంలో దేవీ నవరాత్రులు సందర్భంగా మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఉర్లాంలో లక్ష్మీదేవీ అలంకరణలో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. రూ.లక్షతో దుర్గాదేవిని అలంకరించారు.

బూర్జలో..

బూర్జ: బూర్జ గ్రామంలో శవన్నావరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఐదోరోజు లక్ష్మీదేవి అవతారంలో దుర్గాదేవిని కొలిచారు. కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సారవకోట: శాకంబరీ దేవిగా నీలమణి అమ్మవారు



బూర్జ: దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సారవకోట: స్వర్ణమణి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు



సరుబుజ్జిలి: అమ్మవారి పూజల్లో పాల్గొన్న భవానీ భక్తులు



పొందూరు: కంచి కామాక్షి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న సత్యనారాయణ

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో టీడీపీకి చెందిన మూడు కుటుంబాలు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, విజయనగరం జిల్లా పార్లమెంటరీ పరిశీలకుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ (కేవీజీ) ఆధ్వర్యంలో శుక్రవారం చేరాయి. సువ్వారి యుగంధర్, నక్క రాంబాబు, రావలవలస దాలయ్య కుటుంబాలకు చెందిన వారికి కేవీజీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు, పార్టీ నాయకులు కొంచాడ కృష్ణారావు, బగాది రామారావు, సువ్వారి అన్నంనాయుడు, పైడి చలపతిరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలకృష్ణకు మతిస్థిమితం లేదు

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అసెంబ్లీ వేదికగా ఒక సైకోలా, మతిస్థితమితం లేని వ్యక్తిలా వ్యవహరించారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి అన్నారు. కొత్తూరు మండలం కర్లెమ్మలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దేవాలయంగా భావించిన అసెంబ్లీలో బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలతో చరిత్రహీనుడిగా మిగిలిపోతారన్నారు. బాలకృష్ణ సైకో కాబట్టే 2004లో ఆయన ఇంటికి వచ్చిన ఇద్దరు స్నేహితులపై గన్‌తో కాల్పులు జరిపారన్నారు. ఆ సందర్భంలోనే బాలకృష్ణకు మెంటల్ కండీషన్ సరిగా లేదని వైద్యులు సర్టిఫికెట్ కూడా ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలో ఉన్నామని మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డిపై నోటికి వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

బాలకృష్ణ వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకుంటే ప్రజలే ఆయనకు భవిష్యత్‌లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, మాతల తిరుమల, పార్టీ నాయకులు ఎద్దు ప్రసాద్, హరిదాసు, అగతమూడి నాగేశ్వరరావు, లోతుగెడ్డ తిరుపతిరావు, దూలి అప్పన్న, నగేష్, శంకర్, పోలయ్య, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

పవన్ స్పందించకపోవడం శోచనీయం



కరిమి రాజేశ్వరరావు

నరసన్నపేట: మాజీ కేంద్రం మంత్రి, ప్రముఖ సినీ నటుడు చిరంజీవిపై అసెంబ్లీ వేదికగా హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు శోచనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కరిమి రాజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాలకృష్ణ వ్యాఖ్యపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్సీ నాగబాబు స్పందించకపోవడం అనుమానంగా ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మెగా అభిమానులు బాలకృష్ణ వ్యాఖ్యలపై ఆందోళనలు చేస్తున్నారన్నారు. పవన్, నాగబాబుకు చీమకుట్టినట్లు కూడా లేకపోవడం దారుణమన్నారు. వారిద్దరూ వెంటనే స్పందించాలని, చిరంజీవిపై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఖండించాలని డిమాండ్ చేశారు. బాలకృష్ణకు ఇదివరకే మతిస్థిమితం సరిగా లేదని డాక్టర్లు సర్టిఫికెట్ కూడా ఇచ్చారని, అటువంటి వ్యక్తికి అసెంబ్లీలో మాట్లాడేందుకే అవకాశం ఇవ్వకూడదన్నారు.

కృతజ్ఞతలు..



రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలుపుతున్న లక్ష్మీనారాయణ, నాయకులు

హిరమండలం: మండల కేంద్రానికి చెందిన రాడ లక్ష్మీనారాయణకు వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పార్టీ అధిష్టానం ఇటీవల నియమించింది. పార్టీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని శుక్రవారం పాతపట్నంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రెడ్డి శాంతికి, జిల్లాలోని పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తామన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.వి.సురేష్, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు బెవర గంగాధరరావు, కోఆప్షన్ సభ్యుడు విష్ణుప్రసాద్ పండా, నాయకులు వంగపల్లి చిన్నారావు, వెలమల బాలరాజు, నక్క ఆనందరావు, ఎం.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన



మెట్టక్కివలసలో నివాసాలు చుట్టూ చేరిన వర్షం నీరు

ఆమదాలవలస రూరల్: మండలంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వర్షం నీరు ప్రవహించింది. రైల్వే అండర్ టన్నల్‌లో భారీగా వర్షం నీరు చేరింది. బి.ఆర్.నగర్, మెట్టక్కివలస, తదితర ప్రాంతాల్లో నివాసాల చుట్టూ నీరు చేరటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందిపడ్డారు.



బి.ఆర్.నగర్ వద్ద రహదారిపై ప్రవహిస్తున్న వర్షం నీరు

పాడి పెంపకంలో మెలకువలు తప్పనిసరి

నరసన్నపేట: పాడి రైతులు పాత పద్ధతులను విడిచిపెట్టి పశువుల పెంపకంలో మెలకువలు పాటిస్తే పాల దిగుబడి బాగుంటుందని, పశువులు ఆరోగ్యంగా ఉంటాయని నడగాం పశువైద్యాధికారి ఓంకార్ అన్నారు. మండలం గొనబుపేటలో పాడి రైతులకు హెచ్‌డీఎస్‌ఏ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓంకార్, శాస్త్రవేత్త సునీత మాట్లాడుతూ పశువులకు పెట్టాల్సిన ఆహారం, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పశువుల పెంపకంలో నూతన విధానాలు అవలంబించాలన్నారు.

ఈ కార్యక్రమంలో హెచ్‌డీఎస్‌ఏ సంస్థ డైరెక్టర్ పీవీ రమణ, గంగపుత్ర సీఈఓ వెంకటి, దేవదార కంపెనీ సీఈఓ జి.వల్లంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బురదమయం..



పాతపట్నం మండల కేంద్రంలో బుధ, గురువారాల్లో కురిసిన వార్షాలకు నీలమణిదుర్గ ఆలయం వేనుక ఉన్న పాతపట్నం–తెంబూరు రహదారి బురదమయంగా తయారైంది. ఫ్లై ఓవర్ పనులు జరుగుతుండటంతో మరింత అధ్వానంగా తయారైంది. శ్రీకాకుళం, టెక్కలి నుంచి పాతపట్నం మండల కేంద్రానికి రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిని బాగుచేయాలని కోరుతున్నారు. – పాతపట్నం